# అడుసు తొక్కండి - కాళ్లు కడుగుతాం!

అది విశాఖపట్నంలో అయిదేళ్ల క్రితం తెలుగు దేశాన్ని మెరుగుపర్చడం కోసం నెలకొల్పబడిన రీసెర్చి లాబరేటరీ. తెలుగు దేశపుటవసరాలు బాగా తెలుస్తాయని తెలుగువాడైన సుబ్బరామయ్యను ఆ సంస్థకు డైరెక్టరుగా నియమించడం జరిగింది. అయితే లాబరెటరీ కేంద్ర ప్రభుత్వ నిర్వహణలో ఉన్నందున అక్కడ అన్ని భాషలవారూ సైంటిస్టులుగా ఉంటున్నారు.

రాజారావు ఎన్నో ఆశలతో ఆ లాబరేటరీలో జేరాడు. అతడు వృక్షశాస్త్ర నిపుణుడు. ఆంధ్ర ప్రదేశ్ ప్రాంతంలో విస్తారంగా పెరిగే ఓ మొక్క నుంచి వంట నూనె తయారు చేయవచ్చునని అతడికి అనిపించింది. అంతకు ముందతను ఉత్తర హిందూస్థానంలో ఓ యూనివర్సిటీలో పనిచేస్తుండేవాడు. అక్కడ అతడి కాలం ఎక్కువగా విద్యార్థులతోనే గడిచిపోయేది. ఇక్కడైతే - తెలుగు దేశానికి వచ్చినట్లూ ఉంటుంది, పూర్తిగా రీసెర్చి మీద దృష్టి సారించవచ్చును అని అతడనుకున్నాడు.

ఉద్యోగంలో జేరిన సంవత్సరానికే రాజారావు ప్రయోగాలు సత్ఫలితాలనిచ్చాయి. అతడికెంతో సంతోషం కలిగింది.

మొక్కల నుంచి నూనె వస్తోంది. అది వంటకు పనికి వచ్చే విధంగానూ ఉంది. అయితే అది ఆరోగ్యదృష్ట్యా హానికరమా, కాదా అన్న విషయం అతడు పరిశోధించవలసి ఉన్నది. నూనెను ఎనలైజ్ చేయగా అందులో రెండు కొత్త పదార్థాలున్నట్లు తెలిసింది,

అవేమిటో అంతుబట్టలేదతడికి. లాబరేటరీలోని పరికరాలు ఈ విషయమై అతడికి అంతగా ఉపకరించలేదు.

తన ప్రయోగాల గురించి రాజారావు సుబ్బరామయ్యతో చర్చించాడు. ఆయన అంతా విని, "దేశానికిప్పుడు నూనె కరువు లేదు. ఈ ప్రయోగాలను ప్రస్తుతం ఆపి మరేదైనా ప్రయోజనకరమైన పని ప్రారంభించు" అన్నాడు.

రాజారావు ఆ ప్రయోగాల ప్రాముఖ్యతను డైరెక్టరు సుబ్బరామయ్యకు వివరించాడు.

తన ప్రయోగాలు సఫలమైతే వంటనూనె లీటరు రెండు రూపాయలకే లభిస్తుంది. అదీ గాక ఈ నూనెలో రెండు కొత్త పదార్థాలున్నాయి. అవేమిటో తెలుసుకోవాలి, ఇంతవరకూ ఎవరి దృష్టికీ రాని పదార్థాలవి. వాటి గురించి తెలుసుకోవడానికి దేశంలోని కొన్ని ప్రముఖ లాబరేటరీలకు అతడు స్వయంగా వెళ్ళవలసి ఉన్నది.

"నీకు టూర్ వెళ్ళాలనుంటే మరో మంచి సాకు చూపించు" అన్నాడు సుబ్బరామయ్య చిరాగ్గా.

దీనికి రాజారావు చిరాకుపడ్డాడు.

"అయితే టూర్ కోసమే నేనీ కార్యక్రమం తలపెట్టాననంటారా!"

సుబ్బరామయ్య నవ్వి ఊరుకున్నాడు.

రాజారావు బైటకు వచ్చేక తన కొలీగ్‌కు జరిగింది చెప్పుకున్నాడు. అతడంటే అభిమానమున్న డాక్టర్ సిన్హా - "డైరెక్టరుకు నువ్వంటే అసంతృప్తి ఉంది, ఆ అసంతృప్తిని నీ రీసెర్చిమీద చూపిస్తున్నాడు."

"నీకెలా తెలుసు?" అన్నాడు రాజారావు.

"ఆయన నా వద్ద చాలాసార్లు అన్నాడు. నువ్వు అయనతో ఎప్పుడూ నీ రీసెర్చి వర్కు గురించి మాట్టాడావట. ఎప్పుడూ ఆయన ఇంటికి వెళ్ళలేదట. నువ్వు రాసిన రీసెర్చి పేపర్లలో ఆయన పేరు పెట్టలేదట."

"ఇది చాలా బాగుంది. నాది బోటనీ. ఆయనది జూవాలజీ. రీసెర్చి వర్కు గురించి నేనాయనతో మాట్లాడనవసరంలేదు. రీసెర్చి పేపర్లకు అయను పేరు పెట్టే ప్రసక్తి లేదు. స్వతహాగా నేను రిజర్వుడు మనిషిని. ఆయనింటికి వెడితే - నాకూ ఆయనకూ కూడా కాలక్షేపంగాదు" అన్నాడు రాజారావు.

"ఏమోమరి - మేమంతా అలా చేస్తున్నాం -- నువ్వూ అలా చేయడం మంచిది" - అన్నాడు సిన్హా.

రాజారావు కేం చేయాలో తోచలేదు. ఒకో మనిషికి ఒకో పద్ధతి ఉంటుంది. తన పద్ధతిలో తను జీవిస్తూ సైంటిఫిక్ రీసెర్చి చేసుకుందామనుకుంటున్నాడు.

సిన్హా చెప్పింది నిజమేనని కూడా అతడనుకోలేకపోయాడు. ఉన్నత స్థానంలో ఉన్న ఒక వ్యక్తి భావాలు మరీ అంత నీచంగా ఉంటాయని అతడనుకోలేదు. ఫలితంగా అతడి ప్రాజెక్టుకు అడుగడుగునా అవరోధాలు వచ్చాయి. ఒక్క అడుగు కూడా ముందుకు

వేయడం కష్టంగా ఉంది. క్రమంగా సుబ్బరామయ్యకు అతడంటే శత్రుభావం కలిగి బలపడింది.

ఆ లేబరేటరీలో మూడు నాలుగేళ్ళు గడిపి అసలు విషయం తెలుసుకునేసరికి రాజారావుకు చేతులు కాలిపోయాయి. అతడు సుబ్బరామయ్యతో సయోధ్యకు సిద్ధపడ్డాడు. కానీ సుబ్బరామయ్య అందుకు సిద్ధంగా లేడు. అతడు మాట్లాడ్డానికి వచ్చినపుడల్లా వేళాకోళంగా ఏదో అని రెచ్చ గొట్టేవాడు. రాజారావు రెచ్చిపోయేవాడు.

చివరకు రాజారావు ఈ విషయమై పై అధికారులకు ఫిర్యాదు చేసుకున్నాడు. తన రీసెర్చి ప్రాజెక్టు వల్ల దేశానికి ఎంత ప్రయోజనమో వివరించాడు. పై అధికారులు ఫిర్యాదు మాత్రం చదివారు. వివరణ గురించి ఏ మాత్రమూ పట్టించుకోలేదు.

ఫిర్యాదు గురించి సుబ్బరామయ్యను పై అధికారులు సంజాయిషీ అడిగారు. దానితో సుబ్బరామయ్య అగ్గి మీద గుగ్గిలమయ్యాడు. అతడు రాజారావుని పిలచి, "నువ్వేదో సాధించాననుకుంటున్నావేమో -- నీ ప్రాజెక్టు మరో పదేళ్ళ వరకూ వెలుగు చూడకుండా చేస్తాను" అన్నాడు.

విశాఖపట్నానికి ముగ్గురు సభ్యులున్న ఓ కమిటీ విచారణకు వచ్చింది. అందులో ఒకరు రాజకీయవాది, ఒకరు మాజీ న్యాయవాది. మరొకరు మాత్రం సైంటిస్టు. ఆయన సబ్జక్టు బోటనీ కాదు.

ఈ కమిటీ బస వగైరా అన్ని ఏర్పాట్లు సుబ్బరామయ్య చేశాడు. వారు దగ్గర్లో ఉన్న సింహాచలం, భీమిలి వగైరాలను దర్శించుకురావడానికి కారు నిచ్చాడు. కమిటీ అక్కడ మూడు రోజులుంది. ఒక రోజులో ఒకటిన్నర గంట మాత్రం రాజారావుకు ఆ కమిటీ సభ్యులతో మాట్లాడే అవకాశం లభించింది. వారు తేల్చినది. -

'సుబ్బరామయ్యకు ప్రపంచ ఖ్యాతి ఉంది. లాబరేటరీలో రాజారావుతో మినహాయించి ఇతరత్రా ఆయనకు ఏ గొడవలూ లేవు. అంటే లోపం రాజారావులోనే ఉన్నదనుకోవాలి. రాజారావు ఎటువంటి వర్కు చేయాలీ ఎలా చేయాలీ అన్నది పూర్తిగా సుబ్బరామయ్య నిర్ణయం పైనే ఆధారపడి ఉంటుంది, ఆయన నిర్ణయానికి రాజారావు కట్టుబడి ఉండాలి.'

రాజారావుని నిస్పృహ ఆవరించింది, అతనింక ఆ లాబరేటరీని విడచి పెట్ట దల్చుకున్నాడు. దేశంలో ఉన్న ఇతర పరిశోధనా సంస్థలకతడుత్తరాలు రాశాడు. తన రీసెర్చి ప్రాజెక్టు ప్రాముఖ్యతను వివరిస్తూ అతను దరఖాస్తులు చేసుకున్నాడు. పెద్దగా ప్రయోజనాలేమీ కనబడలేదు. కొందరతడి దర ఖాస్తు చూసి సుబ్బరామయ్యకుత్తరాలు రాశారు - రాజారావు పై అభిప్రాయం వ్రాయమని, అంతే సంగతులు!

సుబ్బరామయ్య రాజారావుని పిలిచి "నిన్ను ఇక్కణ్ణించి ఎక్కడికీ పోనివ్వను, ఇక్కడ పైకి రానివ్వను" అని చెప్పాడు.

రాజారావుకు పరిస్థితి పూర్తిగా అర్థమైపోయింది. అప్పుడతను విదేశాల్లో ఉన్న తన సీనియర్ కొలీగ్ డాక్టర్ సాహాకు ఉత్తరం రాశాడు. ఆయన వివరాలన్నీ చదివి "ప్రాజెక్టు

గురించి ప్రొఫెసర్‌కు చెప్పాను. ఆయనకు నచ్చింది. నువ్వు వచ్చేసే మాటయితే ఆయన నీకు ఇక్కడ చిన్న ఉద్యోగం ఇప్పించగలడట'' అని రాశాడు.

రాజారావీ విషయమై బాగా ఆలోచించాడు. అతడికి దేశం వదిలి పెట్టి వెళ్ళడం ఇష్టం లేదు. ఈ ప్రయోగ ఫలితాలు మరో దేశానికి చెందజేయడం బొత్తిగా ఇష్టంలేదు. కానీ అసలు మొదటికే మోసం వస్తుంటే ఏమిటి చేయడం?

అతను ప్రొఫెసరుతో కరెస్పాండెన్సు ప్రారంభించాడు. అతని ఉత్తరాలు ఆ ప్రొఫెసర్ని మరింత ఇంప్రెస్ చేశాయి. మొదటి సంవత్సరం నెలకు వెయ్యి డాలర్లు వచ్చే స్కాలర్‌షిప్ ఒకటి వెంటనే ఇవ్వగలనని రాశాడు.

రాజారావు ఓ నిర్ణయానికి రావడానికి రెండు మాసాలు పట్టింది. ఈ లోగా అతడికి డాక్టర్ సాహా నుంచి ఒక ఉత్తరం వచ్చింది.

"మైడియర్ రాజారావ్!''

ఇటీవలే ఇండియా నుంచి నాకో ఉత్తరం వచ్చింది. విదేశాల్లో ఉండిపోయిన భారతీయ శాస్త్రజ్ఞుల్ని వెనక్కు రప్పించడం కోసం దేశంలో ప్రత్యేకంగా ఒక విభాగం ఏర్పరచ బడిందట. దీన్ని మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పర్యవేక్షిస్తున్నదట. దేశానికి తిరిగి వస్తే కలుగజేసే సదుపాయాలను తెలియజేస్తూ ఆ విభాగం నుంచి నాకో ఉత్తరం వచ్చింది. అన్నీ నాకు చాలా ఆకర్షణీయంగా కనబడ్డాయి. బహుశా ఓ సంవత్సరం లోపులో నేను దేశానికి తిరిగి రావచ్చు. విదేశాలలోని భారతీయుల్ని వెనక్కు రప్పించుకోవాలనుకుంటున్నప్పుడు దేశంలోని శాస్త్రజ్ఞులను విదేశాలకు వెళ్ళకుండా ఆకర్షించడానికి కూడా గట్టి ఏర్పాట్లే జరుగుతూండవచ్చు. నీకు దేశం వదిలి రావాలని లేదని వ్రాశావు కాబట్టి ఇక్కడ నీకు ఆ విభాగం అడ్రస్ ఇస్తున్నాను.''

ఇలా కొనసాగింది ఆ ఉత్తరం.

రాజారావు ఆలస్యం చేయలేదు. అతడు ఆడ్రసు తీసుకొని వెంటనే ఢిల్లీ చేరుకున్నాడు. ఆ విభాగానికి వెళ్ళాడు. దాని మేనేజర్ ప్రస్తుతం దేశంలో లేడని తెలిసింది. విదేశంలో స్థిరపడి పోయిన శాస్త్రజ్ఞుల మనోభావాలను స్వయంగా అర్థం చేసుకోవడానికి అయన ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉన్నాడట.

"ఆయన్ని కలుసుకోవడానికి ఎప్పటికి వీలవుతుంది?''

"చెప్పడం కష్టం. ఆయన చాలా బిజీగా ఉంటారు'' అన్నాడాయన పియ్యే.

రాజారావతడికి తన సమస్య చెప్పుకున్నాడు.

పియ్యే అతడి వంక అదోలా చూసి, "ఇంక మీకు సమస్యేముందీ? మీరు ఫారిన్ వెళ్ళారంటే ఏదో ఒక రోజున అయనే వచ్చి అక్కడ మిమ్మల్ని కలుసుకుంటాడు. ఇటు మీకు కొంత కాలం ఫారిన్ జీవితం అనుభవించానన్న తృప్తీ ఉంటుంది....'' అన్నాడు.

రాజారావుకు తనేం చేయవలసి ఉన్నదో అర్థమైపోయింది. ★

*(ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక - 6-1-'83)*